సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం । 18 । జూన్ । 2025



చేనుకు చేప మందు

సాధారణంగా ఉబ్బసానికి చేప మందు వేయడం అందరికీ తెలిసిందే. అయితే ఇప్పుడు ప్రకృతి వ్యవసాయంలో చేపలతో చేలకు మందు తయారు చేస్తున్నారు.


8 లో



కోనసీమ కళ .. పూరీలో భళా..

కోనసీమకు చెందిన గరగనాట్యం, వీరనాట్యం కళాబృందాల ప్రదర్శనలకు ఒడిశా రాష్ట్రంలోని పూరీలో జరిగిన ఫోక్ ఫైర్ ఫెస్టివల్ (జానపద జాతర)లో విశేష గుర్తింపు లభించింది.

11,996 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 11,996 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రం లోకి విడుదల చేశారు. ఖరీఫ్‌కు గోదావరి డెల్టా కాలువలకు 8,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 9.80 అడుగుల నీటి మట్టం ఉంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ విభాగంలో నియామకాలు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురు నాయకులను రాష్ట్ర మైనారిటీ విభాగ కమిటీలో నియమించామని పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి చెందిన మీర్జామౌలాఆలీని రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధిగాను, గోపాలపురం నియోజకవర్గానికి చెందిన షేక్‌ఖాదర్ వలీబాషాను రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రటరీగాను, షేక్‌మస్తాన్ బాషాను స్టేట్ మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమించారు.

రక్త సేకరణలో జేఎన్‌టీయూకేకు అవార్డు



ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్‌ను అభినందిస్తున్న వీసీ ప్రసాద్

బాలాజీచెరువు: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన రక్త సేకరణలో జేఎన్‌టీయూకే రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంతో నిలిచి అవార్డును సాధించింది. గుంటూరులో వైద్యశాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈ అవార్డును అందజేశారు. మంగళవారం జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ తన చాంబర్‌లో అవార్డు అందుకున్న ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్‌ను అభినందించారు. 2023–24 ఏడాదికి వర్సిటీ అనుబంధ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల సహకారంతో రక్తదాన శిబిరాలు నిర్వహించి అధిక యూనిట్లు సేకరించడం సంతోషమని, ఈ స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. శ్యామ్‌కుమార్‌ను రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్ర, ప్రిన్సిపాల్ మోహనరావు అభినందించారు.

అయినవిల్లికి పోటెత్తిన భక్తులు




లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకోలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 24 మంది, లక్ష్మీగణపతి హోమంలో 12 జంటలు, స్వామి సన్నిధిలో ఐదుగురు చిన్నారులకు అక్షరాభ్యాసం, చిన్నారులకు తులాభారం, అన్నప్రాసన నిర్వహించారు. 28 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 1600 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి వివిధ పూజ టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,04,571 వచ్చినట్టు ఆలయ ఇన్‌చార్జి ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు.

విద్యా పథకాల అమలుపై సమీక్ష

అమలాపురం టౌన్: విద్యా పథకాల అమలుపై క్షేత్ర స్థాయిలో జరిగే అధ్యయనాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత క్లస్టర్ రీసోర్స్ మొబైల్ టీచర్స్ (సీఆర్‌ఎంటీ)పై ఉందని సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జి.మమ్మీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లాలోని స్కూల్ కాంప్లెక్స్ సీఆర్ ఎంటీలతో సమీక్షించారు. సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ విద్యా పథకాలపై చర్చించారు. విద్యార్థులకు కిట్ల పంపిణీ, టీచర్ల ట్రైనింగ్ తదితర కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మమ్మీ మాట్లాడుతూ విద్యా పథకాల అమలు కోసం సీఆర్‌ఎంటీలు క్షేత్ర స్థాయిలో పాఠశాలలను సందర్శించాలన్నారు. సమగ్ర శిక్షా ఏఎంవో పి.రాంబాబు మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 26 వరకూ ప్రధానోపాధ్యాయులకు లీడర్ షిప్ ట్రైనింగ్, ఈ నెల 23 నుంచి 28 వరకూ గతేడాది ఎఫ్ఎల్ఎన్ శిక్షణ పొందిన ఒకటో తరగతి బోధన చేసే ఉపాధ్యాయులకు రెండో దశ శిక్షణ ఉంటుందని వెల్లడించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్షా ఏఎస్‌వో కె.నారాయణరావుతో పాటు జిల్లాలోని 22 మండలాల పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్‌ల సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

పథకం ప్రకారం కొర్రీలు!





కోరుకొండలో ఈ-కేవైసీ చేస్తున్న రైతులు

- అన్నదాత సుఖీభవ పొందేందుకు నిబంధనలు
- ఈ – కేవైసీ చేసుకోవాలని కొత్త రూల్
- ఈ నెల 20వ తేదీ వరకు గడువు
- రైతులకు తప్పని పాట్లు
- జాబితా తగ్గించేందుకు కుట్రలు
- గత ప్రభుత్వంలో ఏటా 1.33 లక్షల మందికి సాయం

సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో సరికొత్త పంథా అవలంబిస్తోంది. పథకం ఎలా ఎత్తివేయాలన్న ఆలోచన చేయడం.. తప్పని పరిస్థితుల్లో అమలు చేయాల్సి వస్తే.. లబ్ధిదారుల సంఖ్యను భారీగా కుదించడం. నామమాత్రంగా సాయం అందించి చేతులు దులుపుకోవడం. హామీ అమలు చేసేశామని గొప్పలు చెప్పుకోవడం పరిపాటిగా మారుతోంది. అధికారంలోకి వచ్చిన ఏడాది అనంతరం వైఎస్సార్ సీపీ ఒత్తిడితో 'తల్లికి వందనం' పథకం అమలుకు నాంది పలికింది. ఇందులో సైతం భారీగా కోతలు పెట్టింది. అనేక నిబంధనలు తెరపైకి తీసుకొచ్చింది. వెరసి వేలాది మందికి పథకం అందని పరిస్థితి తలెత్తింది.

అన్నదాత సుఖీభవకు ఈ–కేవైసీ కొర్రీ

'తల్లికి వందనం' పథకం అమలులో భారీగా కోతలు పెట్టిన కూటమి సర్కారు తాజాగా మరో పథకంలో కొర్రీలు పెట్టేందుకు కుట్రలు పన్నుతోంది. త్వరలోనే 'అన్నదాత సుఖీభవ' పథకం అమలు చేస్తామంటున్న సర్కారు.. పథకంలో లబ్ధి పొందాలంటే రైతుల వేలి ముద్రలు(ఈ–కేవైసీ) తప్పనిసరి అంటూ నిబంధన తెరపైకి తీసుకువచ్చింది. కూటమి సర్కారు అన్నదాత సుఖీభవ పథకం కోసం సుమారు రెండు లక్షల మంది రైతులకు ఈకేవైసీ చేయాలని వ్యవసాయ శాఖకు జాబితా పంపింది. ఈకేవైసీ గడువు ఈనెల 20వ తేదీ వరకు ఇవ్వడంతో లక్షలాది మంది రైతులకు ఈకేవైసీ సాధ్యమేనా? అన్న సందేహం వ్యక్తం అవుతోంది. వెరసి రైతులు ఈకేవైసీ చేయించుకునేందుకు రైతు సేవా కేంద్రాలకు (ఆర్ఎస్‌కే) పరుగులు తీస్తున్నారు. పనులు మానుకుని రైతులు ఆర్ఎస్‌కేల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన సన్న, చిన్నకారు రైతులు ఉసూరుమంటూ సొంత గ్రామాలకు తిరిగి వస్తున్నారు. రైతు సేవా కేంద్రాల వద్ద గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఇచ్చేదే ఆలస్యంగా.. అందులోనూ నిబంధనలు పెట్టడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి ఏడాది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూపాయి కూడా సాయం అందజేయలేదు. రెండో ఏడాది అమలు చేస్తామన్న పథకానికి నిబంధనలు విధించింది. ఆర్ఎస్‌కేలో వేలిముద్ర (ఈకేవైసీ)ను తప్పనిసరి చేసింది. 10 సెంట్ల లోపు భూమి ఉన్నవారు అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులని ప్రకటించింది. లబ్ధిదారుల సంఖ్య తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం కొత్త నిబంధనలు పెడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కుటుంబంలో ఒక్కరికే..

కూటమి ప్రభుత్వం అందించాలనుకున్న అన్నదాత సుఖీభవ కుటుంబంలో ఒక్కరికే ఇచ్చేలా నిబంధనలు రూపొందించింది. కుటుంబంలో ఇద్దరికి పొలం ఉన్నా.. వారి పేరు మీద వేర్వేరుగా పట్టాదారు పాసుపుస్తకాలు ఉంటే వారిలో ఒకరికి మాత్రమే పథకం వర్తించేలా కుట్రలు చేసింది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కింద ఏటా ఒక్కో రైతుకు రూ.13,500 ఆర్థిక సాయం అందేది. ఆ విధంగా 1.33 లక్షల మంది రైతులకు రూ.90.55 కోట్ల సాయం మంజూరు చేసింది. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే నగదు రైతుల బ్యాంక్ అకౌంట్లో జమ అయ్యేది. వ్యవసాయ పనులు ప్రారంభించిన రైతులకు పెట్టుబడుల కోసం ఇతరుల వద్ద అప్పులు చేయకుండా ఎంతో ఉపయుక్తంగా ఉండేది. ఇలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల పాటు రూ.584.64 కోట్లు అందించారు. ఎలాంటి నిబంధనలు పెట్టకుండా ప్రతి ఒక్కరికీ సాయం అందేలా అప్పటి ప్రభుత్వం చూసింది. రైతుల సంక్షేమానికి కృషి చేసింది. వైఎస్సార్ సున్నావడ్డీ, యంత్రసేవ, 367 ఆర్బీకేల ద్వారా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, ఉద్యాన పంటలకు సైతం ఎంతగానో ప్రోత్సాహం అందించింది.

ఏడాది సాయం ఎగవేత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఏటా పంటల సాగుకు పెట్టుబడి అందిస్తామని నేతలు గొప్పలు చెప్పారు. గద్దెనెక్కిన మొదటి ఏడాదే రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం విస్మరించింది. రెండో ఏడాది ఖరీఫ్ ఆసన్నమైనా ఇప్పటి వరకు సాయం చేసిన దాఖలాలు లేవు. ఇప్పుడు సరికొత్త నిబంధనలు తెరపైకి తీసుకురావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు అందించిన సాయం

పథకం	లబ్ధిదారులు	నగదు (రూ.కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా	1,33,502	584.64
ఉచిత పంటల బీమా	67,513	102.38
సున్నావడ్డీ పంట రుణాలు	27,183	5.01
ఇన్‌పుట్ సబ్సిడీ	52,182	63.97
ఆర్బీకే భవనాల నిర్మాణం	279	52.31



చాగల్లు మండలం ముప్పవరంలో రైతు భరోసా కేంద్రం(ఫైల్)

గర్భస్థ శిశువు నిర్ధారణపై సమగ్ర విచారణ

అధికారులకు కలెక్టర్ ప్రశాంతి సూచనలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గర్భస్థ శిశువు నిర్ధారణ చేయడం, లింగ ఎంపిక నిషేధం వంటి ఘటనల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ప్రశాంతి అధికారుకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బహుళ సభ్యుల సాధికార కమిటీ, జిల్లా సలహా కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ గర్భస్థ శిశువు నిర్ధారణ పరీక్షలు చేయడం, అబార్షన్, పోస్ట్ అబార్షన్ కోసం వాడే మందుల వినియోగంపై ప్రతి నెలా డ్రగ్స్ కంట్రోలర్ ద్వారా సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. అదే సమయంలో ఒక ఆడపిల్ల, ఇద్దరు ఆడపిల్లలు ఉన్న వారిలో ఎంతమందికి అబార్షన్ చేశారు అనే వివరాలు తెలుసుకోవాలన్నారు. డెకాయిట్ ఆపరేషన్ కోసం ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థ ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్కానింగ్ సెంటర్స్ విషయంలో కొత్తగా అనుమతులు, ప్రస్తుతం కొనసాగుతున్న వాటికి రెన్యువల్, సవరణల విషయంలో నియమ నిబంధనలు, అర్హతలపై దృష్టి సారించాలన్నారు. ఏదైనా స్కానింగ్ సెంటర్‌కి అనుమతులు ఇచ్చే క్రమంలో నిర్దుష్టమైన కార్యకలాపాలు నిర్వహించేందుకు లోబడే ఉత్తర్వులు జారీ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు వర్సిటీలో అడ్మిషన్లు ప్రారంభించాలి



విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయానికి వెంటనే వైస్ చాన్సలర్‌ను, రిజిస్ట్రార్‌ను నియమించి అడ్మిషన్లు ప్రారంభించాలని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీ.కే.విశ్వేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. జూన్ నెల 15వ తేదీ దాటిందని, హైదరాబాద్ పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయంలో ఉన్న కోర్సులన్నింటిని ఇక్కడ కూడా ప్రవేశపెట్టేందుకు విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడి అడ్మిషన్లు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ పనిని చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిపై ఉందన్నారు. పురపాలక శాఖా మంత్రితో మాట్లాడి చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే కేంద్రాన్ని తేవాలని, కడప, కర్నూలు కంటే ఆ ప్రాజెక్టు అవసరం రాజమహేంద్రవరం నగరానికి ఎక్కువగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు రూరల్‌లో స్థలం ఇచ్చి వెంటనే ప్రాజెక్టు పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. హుకుంపేటలో నిర్మాణంలో ఉన్న మురికి నీటి శుద్ధి కర్మాగారం పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్లా షరీఫ్, జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు జేటీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా డయేరియా రోగుల ఆరోగ్యం

రౌతులపూడి: డయేరియాతో బాధపడుతూ రౌతులపూడి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆసుపత్రి వైద్యాధికారిణి మంగళవారం జానకీదేవి తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 44 మందికిగాను ఆరోగ్యం మెరుగుపడిన ఏడుగురిని మంగళవారం డిశ్చార్జి చేయగా సత్యవరం గ్రామానికి చెందిన మరో మూడు డయేరియా కేసులు నమోదయ్యాయన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 40 మంది వరకు చికిత్స పొందుతున్నారు. వారందరి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో జిల్లా రాపిడ్ రెస్పాన్స్ బృంద సభ్యులు డాక్టర్ వి.అరవింద్ కుమార్, డాక్టర్ వి.సత్యచంద్రిక, డాక్టర్ ఎస్.రుక్మిణీదేవి మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న చికిత్స, తీసుకోవలసిన జాగ్రత్తలు, రోగులు ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. మెరుగైన చికిత్స నందించేందుకు అవసరమైన సూచనలను సీహెచ్‌సీ వైద్యులకు సూచించారు. డయేరియా ప్రబలిన సబ్‌ప్లాన్ ఏజెన్సీకి చెందిన దబ్బాది, సత్యవరం గ్రామాల్లో తాగునీరు, ఆహార దినుసులు, తదితర శాంపిల్స్‌ను సేకరించేందుకు చర్యలు చేపట్టాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ పావని పాల్గొన్నారు.



సీహెచ్‌సీలో డయేరియా రోగులను పరామర్శించి వివరాలు సేకరిస్తున్న రాపిడ్ రెస్పాన్స్ వైద్య బృందం

యోగా ప్రయోజనాలపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, శానిటేషన్ సిబ్బంది

డీఆర్ఓ సీతారామమూర్తి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): యోగాంధ్ర సాధనలో 'వన్ హెల్త్ – వన్ ఎర్త్ ' అనే నినాదంతో మానవాళికి ఆరోగ్యవంతమైన మార్గంలో యోగా సాధన వల్ల చేకూరే ప్రయోజనంపై అవగాహన కల్పిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి అన్నారు. రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ వద్ద పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం యోగాంధ్ర సాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో సీతారామమూర్తి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 4,900 పైగా ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రదేశాల్లో 7,50,000 మంది యోగ సాధకులకు నిత్యం శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు.

గట్టు తెగితే గల్లంతే..

- బలహీనంగా ఏటిగట్లు
- వరదలు వచ్చే సమయం
- స్థానికుల ఆందోళన



టి.కొత్తపల్లి - దుప్పిలంక వద్ద ఏటిగట్టు దుస్థితి



ఐ.పోలవరం మండలం కేశనకుర్రులో బలహీనంగా ఉన్న ఏటిగట్టు

ఐ.పోలవరం: ఒకవైపు గౌతమి గోదావరి పాయ... మరోవైపు వృద్ధ గౌతమి నదీ పాయ...ఈ రెండింటి మధ్య ఉండే దీవి ఐ.పోలవరం (ఐలాండ్). సుమారు 16 గ్రామాలతో ఉండే ఐలాండ్‌లో దాదాపు లక్ష మంది వరకూ ప్రజలు జీవిస్తున్నారు. గోదావరి మధ్యన ఉండే ఈ దీవికి వరద సమయంలో చుట్టూ ఉన్న ఏటిగట్లే శ్రీరామరక్ష. 2006, 2022లో గోదావరికి వచ్చిన అతి పెద్ద వరదల నుంచి ఇవే ఐలాండ్‌ను రక్షించాయి. అటువంటి ఏటిగట్లకు గత కొన్నేళ్లుగా కనీస మరమ్మతులు చేపట్టలేదు. దీంతో అవి కుంగిపోయి ప్రమాదకరంగా మారాయి.

వరద పోటు

గోదావరికి వరద పోటు తాకగానే ఏటిగట్లను ఆనుకుని ఉండే నది లంక గర్భాలు నీట మునుగుతుంటాయి. ఏటిగట్టు పట్టున ఉండే పంట పొలాలు, ఇళ్లల్లోకి వరద నీరు చేరడం ఇక్కడ సర్వసాధారణం. అయితే ఏటిగట్ల వల్ల వరద నీరు గ్రామాల్లోకి రాకుండా ఉంటుంది. ఐలాండ్ చుట్టూ 36 కిలోమీటర్ల మేర ఏటిగట్లు విస్తరించి ఉన్నాయి. వీటిని 2000లో ఎత్తు చేసి పటిష్ఠ పరిచారు. నాటి నుంచి నేటి వరకు కనీస మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. ఇప్పుడవి బలహీనపడడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుంగిపోయి..

ఐ.పోలవరం మండలంలోని పలు గ్రామాలలో ఏటిగట్లు కుంగి స్థానికులను భయపెడుతున్నాయి. గట్లకు రక్షణగా ఉన్న మట్టి అండలుగా జారిపోతోంది. కొన్ని ప్రాంతాల్లో కోతలకు గురై ప్రమాదకరంగా మారాయి. గట్ల మీద వేసిన గ్రావెల్, బీటీ రోడ్లు అధ్వానంగా తయారై, రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. మండలంలోని కేశనకుర్రు, కేశనకుర్రుపాలెం, తిల్లకుప్ప, దుప్పిలంక, జి.మూలపాలెం, జి.వేమవరంలో ఐలాండ్ ఏటిగట్లు బలహీనంగా ఉన్నాయి. ఇటువంటిచోట మరమ్మతులు చేపట్టి, గట్లకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

కొంపముంచుతున్న ఆక్వా సాగు

ఏటిగట్లను ఆనుకుని నదీ గర్భంలో ఆక్వా సాగు చేపట్టారు. దీని కోసం ఏటిగట్టు వెంబడి ఇష్టానుసారం తవ్వకాలు చేస్తున్నారు. నదీ గర్భంలోనే ఆక్వా చెరువులు ఉన్నాయి. గట్లకు ఆనుకుని నదిలో ఉండే పెద్ద పెద్ద మట్టి దిబ్బలను తొలగించడం వల్ల వరద నీటి ప్రవాహం నేరుగా గట్టుకు తగులుతోంది. దీని వల్ల గండ్లు పడే ప్రమాదం మరింత పెరుగుతోంది. ఆక్వా చెరువుల తవ్వకాలు 1856 మద్రాస్ కన్జర్వెన్సీ యాక్టుకు పూర్తి విరుద్ధం. నది వైపునే కాకుండా నదికి ఇవతలి వైపు ఐలాండ్‌లో సాగు చేసే ఆక్వా చెరువుల కోసం గట్లను ధ్వంసం చేసి, మోటార్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇటువంటి చర్యల వల్ల వీటి వల్ల కూడా గట్లు బలహీనపడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కొమరగిరి, పాత ఇంజరం, ఎదుర్లంక, జి.వేమవరం, మురమళ్ల, పశువుల్లంక, కేశనకుర్రు. జి.మూలపాలెంలో ఆక్వా సాగు పెద్ద ఎత్తున సాగుతోంది. ఇంత జరుగుతున్నా హెడ్ వర్క్స్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

దెబ్బతిన్న ఐలాండ్ రోడ్లు

గతంలో ఐలాండ్ చుట్టూ రోడ్ల నిర్మాణం చేపట్టారు. పలుచోట్ల బీటీ రోడ్లు వేశారు. మొత్తం బీటీ రోడ్డు వేసి ఉంటే వాహనాల రాకపోకలు పెరిగి గట్లు బలపడడంతో పాటు స్థానికులకు రవాణా సౌకర్యం కూడా ఏర్పడుతుందని భావించారు. దీనితో పాటు నదిని ఆనుకుని రిసార్టుల నిర్మాణాలు జరిగితే పర్యాటకాభివృద్ధి జరుగుతుందని ప్రణాళికలు రచించారు. ఆ తర్వాత వాటి సంగతి వదిలేశారు. ప్రస్తుతం ఏటిగట్ల మీద రహదారులు దెబ్బతినడంతో రైతులు, స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. గోదావరికి వరదలు సమీపిస్తున్న తరుణంలో గట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు గట్లను పటిష్ఠం చేసే పనులు చేపట్టాలని ఐలాండ్ వాసులు కోరుతున్నారు.

రక్షణ చర్యలు చేపట్టాలి

ఐలాండ్ ఏటిగట్లను 2000లో పటిష్ఠ పరిచారు. ఆ పనులు జరిగి ఇప్పటికి దాదాపు 24 ఏళ్లు అవుతోంది. కాబట్టి ఏటిగట్లను సమగ్రంగా పరిశీలించి, కుంగిన ప్రాంతాలను గుర్తించి వెంటనే పటిష్ఠ పనులు చేపట్టాలి. మరో నెల రోజుల్లో గోదావరి వరదలకు వచ్చే అవకాశం ఉన్నందున వెంటనే పనులు ప్రారంభించాలి.

– ఎస్.రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ, టి.కొత్తపల్లి, ఐ.పోలవరం మండలం

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	18,000 – 18,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	27,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	17,000 – 17,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 18,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

చేనుకు చేప మందు

- ప్రకృతి వ్యవసాయంలో చేపలతో మీనామృతం తయారీ
- దుర్గాడలో ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న ద్రావణం



మీనామృతం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ వనరుల తయారీ కేంద్రం సిబ్బంది

పిఠాపురం: సాధారణంగా ఉబ్బసానికి చేప మందు వేయడం అందరికీ తెలిసిందే. అయితే ఇప్పుడు ప్రకృతి వ్యవసాయంలో చేపలతో చేలకు మందు తయారు చేస్తున్నారు. దాన్నే ఫిష్ అమినో యాసిడ్ మీనామృతం అని పిలుస్తున్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలోని గో గాయత్రి ప్రకృతి వ్యవసాయ వనరుల తయారీ శిక్షణ కేంద్రంలో ఈ ఏడాది అధిక మొత్తంలో మీనామృతం తయారీ చేపట్టారు. రోజుకు 300 లీటర్ల మీనామృతం తయారు చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. ఇక్కడి నుంచి వివిధ జిల్లాలకు ఈ మందును పంపిణీ చేయనున్నారు. మీనామృతం తయారీ విధానాన్ని ఆ శిక్షణా కేంద్రం నిర్వాహకుడు గుండ్ర శివచక్రం వివరించారు.

మీనామృతం

మీనామృతం తయారీకి చేపలు, బెల్లం, బొగ్గు, దేశీయ ఆవు మూత్రం అవసరమవుతుంది. ముందుగా చేపలను చిన్న ముక్కలుగా కట్ చేసి పెట్టుకోవాలి. చేప లోపలి భాగాలను కూడా వినియోగించుకోవచ్చు. వాటిని పారవేయాల్సిన అవసరం లేదు. ముందుగా కత్తిరించిన చేపలు ఎన్ని కేజీలున్నాయో తూకం వేసి సిద్ధం చేసుకోవాలి. అంతే మొత్తంలో బెల్లాన్ని దగ్గర పెట్టుకోవాలి. బెల్లాన్ని పొడిగా దంచుకోవాలి. 200 లీటర్ల కెపాసిటీ గల డ్రమ్ములు తీసుకోవాలి. వాటిని ముందుగానే శుభ్రం చేసుకోవాలి. మీనామృతం కలపడానికి ఒక పెద్ద గిన్నె లేదా టబ్ అవసరం. అది పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.

తయారీ విధానం

పెద్ద గిన్నె లేదా టబ్‌లో 10 కేజీల చేపలు, 10 కేజీల బెల్లం, 100 గ్రాముల బొగ్గు పొడి, ఒక లీటర్ ఆవు మూత్రం పోసి బాగా కలుపుకోవాలి. ఈ విధంగా ఎన్ని కేజీల చేపలు ఉంటే అన్నిసార్లు కలుపుకొని డ్రమ్ములో వేసుకోవాలి. వీటిని కలిపే సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. పాత్రలు శుభ్రంగా ఉండేలా చూడాలి. తడి లేకుండా ఎండబెట్టుకోవాలి. ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముందుగానే చేపలు ఎన్ని ఉన్నాయో అంచనా వేసుకొని అందుకు తగిన విధంగా డ్రమ్ములు సిద్ధం చేసుకోవాలి.

పాడి-పంట

జాగ్రత్తలు తప్పనిసరి

డ్రమ్ములో కలిపిన చేపలు వేసినప్పుడు 60 శాతం మాత్రమే నింపాలి. లేకపోతే రెండో రోజు పొంగిపోయే అవకాశం ఉంటుంది. డ్రమ్ము 60 శాతం నింపిన తరువాత దానిని కప్పేందుకు సరిపడా ప్లాస్టిక్ కవర్, ప్లాస్టిక్ సంచితో మూతిని గట్టిగా కట్టాలి. దీన్ని ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సవ్య దిశలో ఐదు నిమిషాల పాటు కర్రతో కలుపుతూ ఉండాలి. అనంతరం కర్రను శుభ్రం చేసి పక్కన పెట్టుకోవాలి. లేకపోతే వాటిపై ఈగలు వాలి గుడ్లు పెడతాయి, దానితో ద్రవాన్ని కలిపినప్పుడు పురుగులు తయారయ్యే ప్రమాదం ఉంటుంది. ద్రవాన్ని కలిపిన అనంతరం డ్రమ్ముకు కవర్ కట్టి వేయాలి. ఇలా 20 నుంచి 25 రోజులలో ద్రావణం తయారవుతుంది. సుమారు 20 రోజుల తర్వాత ద్రావణం నుంచి తాటి పండు వాసన వస్తుంది. అలా వాసన వస్తే ద్రావణం ఉపయోగించడానికి వీలుగా తయారైనట్లు గుర్తించాలి.



ద్రావణాన్ని తయారు చేయడానికి సిద్ధం చేసిన చేపలు

ఉపయోగించే విధానం

మొక్కలు నారుదశలో ఉన్నప్పుడు వంద లీటర్ల నీటికి 250 గ్రాముల ద్రావణం సరిపోతుంది.

చిన్న మొక్కలైతే 500 గ్రాములు, పెద్దవైతే ఒక కేజీ వరకూ వాడుకోవచ్చు. స్ప్రే చేసినప్పుడు ఫలితం తొందరగా కనిపిస్తుంది. ఎకరానికి ఐదు నుంచి పది కేజీల వరకూ ఉపయోగించుకోవాలి. ఈ ఫిష్ అమినో యాసిడ్ నీటిలో కలిపే ముందు ఒక కేజీ ద్రావణాన్ని ఐదు లీటర్ల నీటిలో బాగా కలుపుకొని, ఫిల్టర్ చేసుకోవాలి. దాన్ని వంద లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ప్రయోజనాలు ఇవే..

- ఫిష్ అమినో యాసిడ్‌లో నత్రజని శాతం ఎక్కువ ఉండడం వల్ల మొక్కలు తొందరగా పెరుగుతాయి.
- స్వల్ప కాలిక పంటలైన కూరగాయలు, వరి, పప్పు దినుసులకు మొదటి 40 రోజులు చాలా కీలకమైనవి. వాటి పెరుగుదల పైన మాత్రమే దిగుబడి ఆధారపడి ఉంటుంది. ఐదు రోజులకు ఒకసారి చొప్పున ఈ ద్రావణాన్ని పిచికారీ చేస్తే యూరియా, డీఏపీ ఎరువుల కంటే ఎక్కువ బలాన్ని పంటకు ఇస్తుంది.
- 40 రోజుల తర్వాత పది రోజులకు ఒకసారి ఇతర ద్రవాలతో కలిపి దీనిని వాడుకోవచ్చు. దీనిని వాడడం వల్ల మొక్క ఆకులు బాగా పచ్చబడటం, కొమ్మలు బాగా రావటం, కాయ సైజు బాగా పెరగడం జరుగుతుంది.
- నత్రజనితో పాటు ఇతర పోషకాలు ఉండటం వల్ల పూత, పిందె ఎక్కువ మొత్తంలో వస్తుంది.

'నన్నయ' రిజిస్ట్రార్‌గా సుధాకర్ పదవీ విరమణ



ఆచార్య సుధాకర్‌ను సన్మానిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఆచార్య జి.సుధాకర్ పదవీ విరమణ చేశారు. ఈ మేరకు యూనివర్సిటీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయనను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ఘనంగా సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. ఆమె మాట్లాడుతూ 2023 ఆగస్టు 23 నుంచి రిజిస్ట్రార్‌గా సుధాకర్ విశిష్ట సేవలందించారన్నారు. 'నన్నయ' యూనివర్సిటీ అభివృద్ధిలో ఒక రిజిస్ట్రార్‌గా భాగస్వామినైనందుకు ఆనందంగా ఉందని ఆచార్య సుధాకర్ పేర్కొన్నారు. కాగా.. సుధాకర్ ఇక నుంచి ఆంధ్ర యూనివర్సిటీలో హ్యూమన్ జెనిటిక్స్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించనున్నారు. ఇదిలావుండగా 'నన్నయ' యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా అకడమిక్ డీన్ ఆచార్య కేవీ స్వామిని నియమిస్తూ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ ఉత్తర్వులు జారీ చేశారు.

దేవదాయశాఖ ఆస్తులను పరిరక్షించాలి

బోట్‌క్లబ్ (కాకినాడ): ఆలయాలు, సత్రాలకు సంబంధించిన భూములు, ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురైతే కోర్టులో కేసులు దాఖలు చేయాలని జిల్లా దేవదాయశాఖాధికారి కె.నాగేశ్వరరావు అన్నారు. కాకినాడ నగరంలోని ఆలయ, సత్రాలకు సంబంధించిన ఈవోలతో మంగళవారం ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. దేవదాయశాఖకు చెందిన ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత ఆయా ఆలయ ఈఓ, సత్రాల ఈవోలపైనే ఉందన్నారు. నగరం పరిధిలో ఉన్న ఆలయాలు, సత్రాలకు ఉన్న భూములు, ఖాళీ స్థలాలు అన్నీ ఆన్‌లైన్‌లో ఆయా సత్రాలు, ఆలయాల పేరున ఉన్నాయో లేదో పరిశీలించాలన్నారు. భూములు ఏమైనా ఆక్రమణలో ఉంటే వాటిని ఖాళీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆ శాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్ర కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు రెండు యూనివర్సిటీల్లో మెగా యోగాంధ్ర

రాజానగరం: దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుమేరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆదికవి నన్నయ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లు పోటీ పడుతున్నాయి. నన్నయలో బుధవారం ఉదయం 7.30 గంటలకు, జీజీయూలో ఉదయం 6.30 గంటలకు ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా నన్నయలో యోగా డెమో, వేదిక నిర్మాణం, వాహనాల పార్కింగ్, హాస్పిటాలిటీ తదితర ఏర్పాట్లను మంగళవారం వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పి.ప్రశాంతి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. అలాగే జీజీయూలోనూ సుమారు 10 వేల మంది విద్యార్థులు, అధ్యాపకులు, ఇతరులు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేసే విధంగా ఏర్పాట్లు పూర్తి చేశామని ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) తెలిపారు.

పూరీ జగన్నాథ స్వామి రథోత్సవానికి ప్రత్యేక బస్సు

రావులపాలెం: పూరీ జగన్నాథ స్వామి రథోత్సవానికి రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్టు మేనేజర్ జీజీవీ రమణ మంగళవారం తెలిపారు. ఈనెల 26 తేదీన బస్సు బయలుదేరి జగన్నాథ స్వామి రథోత్సవం అనంతరం అరసవల్లి, కోణార్క్, పూరీ, భువనేశ్వర్, సింహాచలం క్షేత్రాల దర్శనం అనంతరం 29 తేదీన రావులపాలెం చేరుతుందన్నారు. ఉదయం, రాత్రి టిఫిన్, మధ్యాహ్న భోజనంతో సహా ఒక్కరికి టికెట్ ధర రూ.4,600గా నిర్ణయించామన్నారు. అడ్వాన్స్ టికెట్లు, మరిన్ని వివరాలకు డిపో మేనేజర్ 99592 25537, అసిస్టెంట్ మేనేజర్ 73829 11871 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

కోనసీమ కళ .. పూరీలో భళా..



పూరీలో ఏసు వెంకట ప్రసాద్‌ను సత్కరిస్తున్న మంత్రి కృష్ణచంద్ర

కొత్తపేట: కోనసీమకు చెందిన గరగనాట్యం, వీరనాట్యం కళాబృందాల ప్రదర్శనలకు ఒడిశా రాష్ట్రంలోని పూరీలో జరిగిన ఫోక్ ఫైర్ ఫెస్టివల్ (జానపద జాతర)లో విశేష గుర్తింపు లభించింది. ఆ ఫెస్టివల్‌లో భాగంగా వెస్ట్ జోన్ కల్చరల్ ఉదయ్‌పూర్, సౌత్ జోన్ కల్చరల్ తంజావూరు, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జానపద జాతర నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన కొమారిపాటి ఏసు వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో గరగనాట్యం, వీరనాట్యం ప్రదర్శనలకు అవకాశం లభించింది. సోమవారం నిర్వహించిన ఆయా ప్రదర్శనల్లో ప్రసాద్‌తో పాటు 20 మంది ఆయా కళాబృందాలు తమ ప్రతిభను ప్రదర్శించి, నిర్వాహకులను, ప్రముఖులను, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆ కళాకారులను ముఖ్యంగా టీమ్ లీడర్ ఏసు వెంకట ప్రసాద్.. ఒడిశా హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖల మంత్రి డాక్టర్ కృష్ణచంద్ర మహాపత్ర, తదితర ప్రముఖుల అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ తమ బృందాలను గుర్తించి దేశ, విదేశాల్లో అవకాశాలు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ కల్చరల్ సీఈఓ మల్లికార్జున రావుకు కళాబృందాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



వెంకట రమణ (ఫైల్)

తుని: అన్నవరం – రావికంపాడు రైల్వేస్టేషన్ల మధ్యలో రైలు నుంచి జారిపడి కొడకల వెంకట రమణ (30) అనే వ్యక్తి మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం జల్లూరుకు చెందిన కొడకల వెంకటరమణ అనపర్తి మండలం పి.రామచంద్రాపురం కోళ్లఫారంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. తల్లికి ఆరోగ్యం బాగోలేదని తెలియడంతో సోమవారం రాత్రి రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నానికి రైలులో బయలుదేరాడు. అయితే మార్గం మధ్యలో రైలు నుంచి జారిపడి తీవ్ర గాయాలు కావడంతో 108లో తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. వెంకటరమణకు భార్య, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తొమ్మిది మందికి రిమాండ్

ఆలమూరు: మండల కేంద్రమైన ఆలమూరులో జరిగిన పరస్పర దాడులకు సంబంధించి తొమ్మిది మంది నిందితులకు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు రిమాండు విధించింది. స్థానిక ఎస్సై ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక యర్ర కాలనీ సమీపంలో ఈ నెల 15వ తేదీ రాత్రి పెనికేరుకు చెందిన కె.రోహిత్, చింతలూరుకు చెందిన పి.తేజ వర్గాల మధ్య కొట్లాట జరిగింది. ఈ సందర్భంగా ఒక వర్గంపై మరొక వర్గం దాడులు చేసుకున్నాయి. దీంతో పోలీసులు అప్రమత్తమై 15 మంది నిందితులను గుర్తించి సోమవారం కేసు నమోదు చేశారు. వారిలో ఇప్పటికే అరెస్ట్ చేసిన తొమ్మిది మందిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఐ.ప్రవీణ్ కుమార్ 15 రోజుల రిమాండు విధించారు. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు.

వెళ్లింది 31 మంది... వచ్చింది 50 మంది

నర్సింగ్ ఆఫీసర్ల కౌన్సెలింగ్ పూర్తి



వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరైన నర్సులు

కాకినాడ క్రైం: సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా కాకినాడ జీజీహెచ్‌లో పనిచేస్తున్న నర్సింగ్ ఆఫీసర్లకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జీజీహెచ్‌లోని కమ్యూనిటీ హాల్లో వెబ్ ద్వారా నిర్వహించిన ఈ ప్రక్రియను సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి పర్యవేక్షించారు. జీజీహెచ్‌లో తొలి నుంచి 24 ఖాళీ స్టాఫ్ నర్సుల పోస్టులు ఉండగా, ఉన్న వారి నుంచి 31 మంది బదిలీ అయ్యారు. దీంతో మొత్తం 55 ఖాళీలు ఏర్పడ్డాయి. మంగళవారం నాటి కౌన్సెలింగ్ ప్రక్రియలో వివిధ ప్రాంతాల నుంచి 50 మంది స్టాఫ్ నర్సులు కొత్తగా కాకినాడ జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు. దీంతో సింహభాగం భర్తీ అయి, మరో ఐదు ఖాళీలు మిగిలాయి. అలాగే, జీజీహెచ్‌లో పనిచేస్తున్న హెడ్ నర్సులు 9 మంది బదిలీ అయ్యారు. ఆ స్థానంలో ఒక్కరు కూడా చేరలేదు. స్టాఫ్ నర్సులకు పదోన్నతులు వచ్చే వరకు ఈ స్థానాలు భర్తీ అయ్యే ప్రసక్తే లేదు. ఈ పరిస్థితి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. స్టేషన్ సీనియారిటీని అనుసరించి బదిలీ అయిన వీరంతా రాజమహేంద్రవరం, విజయవాడ, ఏలూరు, మచిలీపట్టణం ప్రభుత్వాసుపత్రులకు వెళ్లారు. అలాగే నర్సింగ్ ట్యూటర్లలో ఓ పోస్టు రిటెన్షన్ అయి దరఖాస్తుదారు అదే స్థానంలో కొనసాగనున్నారు. మరో పోస్టు ఖాళీగా ఉండగా తాజా బదిలీలో భర్తీ అయ్యింది.

వేస్ట్ ఆయిల్ ప్యూరిఫై యూనిట్‌లో తనిఖీలు



తనిఖీలో పాల్గొన్న విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు

కాకినాడ రూరల్: సర్పవరం ఆటోనగర్‌లో వేస్ట్ ఆయిల్‌ను ప్యూరిఫై చేసి సెకండ్ గ్రేడ్ ఆయిల్, గ్రేజ్ తయారు చేసే ఎస్ఏఎఫ్ పెట్రోలియం యూనిట్‌పై విజిలెన్స్, సివిల్ సప్లయీస్ అధికారులు దాడులు నిర్వహించారు. రాజమహేంద్రవరం విజిలెన్స్ డీఎస్పీ తాతారావు, విజిలెన్స్ సీఐలు, కాకినాడ సివిల్ సప్లయిస్ అసిస్టెంట్ సప్లయి అధికారి ప్రసన్న లక్ష్మీదేవి, అర్బన్ టీపీ అనిల్ కుమార్ తదితరులు సోమవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా చెన్నై నుంచి ట్యాంకర్‌లో తీసుకువచ్చిన టర్పెన్‌టైన్‌ను గుర్తించారు. జీఎస్టీ బిల్లులు ఉన్నప్పటికి టర్పెన్‌టైన్‌లో పెట్రోలియం కంటెంట్ ఉండడంతో వాహనంతో సహా 25 వేల లీటర్ల సరుకు ఉన్నట్టు గుర్తించారు. టర్పెన్‌టైన్ ఉన్న వాహనంతో పాటు మరో ఖాళీ వాహనాన్ని సీజ్ చేశారు. వాహనాలు, సరకు విలువ సుమారు రూ.75 లక్షలు అధికారులు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ప్రమాదంలో ధ్వంసమైన ఆర్టీసీ బస్సు ముందు భాగం

చాగల్లు: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో బస్సులోని ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. నిడదవోలు – వంగిడి రహదారిలోని ఎస్.ముప్పవరం శివారులో ఇసుక ట్రాక్టర్ ఆగి ఉంది. దాన్ని పోలవరం నుంచి నిడదవోలు వెళుతున్న నిడదవోలు డిపోకు చెందిన బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందుభాగం ధ్వంసమైంది. అలాగే బస్సు ఢీకొనడంతో ట్రాక్టర్ ఇంజిన్ ఆన్ అయ్యి సమీపంలో ఇంటి గేటును ఢీకొని ట్రక్కు బోల్తా పడింది. బస్సులో ప్రయాణిస్తున్న కొవ్వూరుకు చెందిన జి.వీర వెంకట సత్యనారాయణతో పాటు మరో ప్రయాణికుడికి గాయాలయ్యాయి. మిగిలిన ప్రయాణికులు సురక్షితంగా ఉండటంతో వారిని మరో బస్సులో ఎక్కించి గమ్యస్థానాలకు చేరవేశారు.

గంజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్టు



గంజాయి తరలిస్తున్న యువకులను అరెస్టు చేసిన పెరవలి పోలీసులు

పెరవలి: గంజాయి తరలిస్తున్న ఐదుగురిని పెరవలిలో పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. తణుకుకు చెందిన పాలుమూరి సాగర్, కానూరు అగ్రహారానికి చెందిన కర్సినపు ప్రవీణ్ కుమార్, నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామానికి చెందిన మహమ్మద్ సలీం, కొవ్వూరు మండలం మద్దూరు గ్రామానికి చెందిన తగరపు వెంకట్, వర్ధణపు మణి తదితరులు మూడు కిలోల గంజాయిని రవాణా చేయటానికి ప్రణాళిక వేసుకున్నారు. వీరందరూ పెరవలిలోని హిందూ శ్మశానవాటిక సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు గమనించారు. అనుమానంతో వారిని పట్టుకుని తనిఖీ చేయగా మూడు కిలోల గంజాయి దొరికింది. దానితో పాటు రెండు మోటారు సైకిళ్లను పోలీసులు సీజ్ చేశారు. నిందితులు ఐదుగురినీ అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి తణుకు కోర్టులో మంగళవారం హాజరు పరిచారు.

గంజాయి కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు



కోరుకొండలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

కోరుకొండ: గంజాయి కేసులో ప్రధాన నిందితుడు కాళ్ల నరేష్‌ను కోరుకొండ పోలీసులు మంగళవారం అరెస్టు చేసినట్టు నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. కోరుకొండ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో చింతపల్లి నుంచి తీసుకొచ్చిన రెండు కేజీల గంజాయిని కోరుకొండ మండలం అయ్యన్నగళ్ల వద్ద పంచుకుంటుండగా నిందితులను అరెస్టు చేశామన్నారు. ఆ సమయంలో ఐదుగురు దొరికారని, ప్రధాన నిందితుడు కాళ్ల నరేష్ పరారయ్యాడన్నారు. స్థానిక సాంబశివరావు కాలనీకి చెందిన నరేష్ కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల్లో పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నట్టు తెలిపారు. కాగా.. నరేష్‌ను అరెస్టు చేయడానికి కృషి చేసిన ఎస్సై కూన నాగరాజు, కానిస్టేబుల్ ఉదయ భాస్కర్, ప్రసాద్ అభినందించారు. సమావేశంలో కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్, ఎస్సై కూన నాగరాజు పాల్గొన్నారు.

అమలాపురంలో అదృశ్యం.. విశాఖలో ప్రత్యక్షం

- తల్లీపిల్లల ఆచూకీ లభ్యం
- భర్త వేధింపులు భరించలేకే పారిపోయినట్టు వెల్లడి



తల్లీపిల్లలను బంధువులకు అప్పగిస్తున్న అమలాపురం పట్టణ సీఐ వీరబాబు



ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో బాలికను తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

అమలాపురం టౌన్: అమలాపురం నుంచి రెండు రోజుల కిందట అదృశ్యమైన తల్లీ పిల్లలను (కుమార్తె, కుమారుడు) విశాఖపట్నం మద్దెలపాలెంలో పోలీసులు మంగళవారం ఉదయం గుర్తించారు. తన భర్త పెట్టే వేధింపులు భరించలేకే కన్నబిడ్డలతో కలిసి ఇల్లు విడిచి వెళ్లిపోయినట్లు ఆ మహిళ పోలీసులకు తెలిపింది. ఈ నెల 15న తల్లీపిల్లల అదృశ్యంపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పట్టణ పోలీసులు తక్షణమే వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కేవలం రెండు రోజుల్లో అదృశ్యమైన ఆ కుటుంబాన్ని వెతికి పట్టుకున్నామని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. అమలాపురం రూరల్ మండలం పేరూరు గ్రామ శివారు దూడలవారి వీధికి చెందిన చవ్వాకుల నరేష్ భార్య హారతి (24), కుమార్తె నందన (6), కుమారుడు భార్గవ్ (4) ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. హారతి తన బిడ్డలతో తొలుత మామిడికుదురు మండలం లూటుకుర్రులోని తన పుట్టింటికి స్కూటీపై వెళ్లడం, అక్కడ నుంచి అమలాపురం ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు వచ్చి సైకిల్ స్టాండ్‌లో స్కూటీని పెట్టి అదృశ్యమైనట్లు పోలీసులు ఆ రోజు రాత్రే గుర్తించారు. విశాఖపట్నం బస్సు ఎక్కి వెళ్లిన ఆమె తన బిడ్డలతో మద్దెలపాలెంలో ఓ చిన్న గది అద్దెకు తీసుకుని ఉన్నట్లు అమలాపురం పోలీసుల విచారణలో తేలింది. వారిని విశాఖ నుంచి అమలాపురం తీసుకుని వచ్చి బంధువులకు అప్పగించారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో ఎస్సై కేఎం జోషి, కానిస్టేబుల్ రాయు డు శ్రీను, ఐటీ కోర్ విభాగం కానిస్టేబుల్ జాఫర్ సాంకేతికత ఆధారంగా తల్లీపిల్లలను గుర్తించారు.

తల్లి వద్దకు క్షేమంగా చేరిన బాలిక

కాకినాడ రూరల్: చీడిగ గ్రామానికి చెందిన పదేళ్ల బాలిక చల్లా సత్య పావని అదృశ్యం కేసు సుఖాంతమైంది. ఆ బాలికను మంగళవారం ఇంద్రపాలెం పోలీసులు క్షేమంగా తల్లిదండ్రులు వద్దకు చేర్చారు. వివరాల్లోకి వెళితే.. ఐదో తరగతి చదువుతున్న సత్య పావని సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. తల్లి సంధ్య ఫిర్యాదు మేరకు ఇంద్రపాలెం పోలీసులు రాత్రి అదృశ్యం కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ చైతన్య కృష్ణ, ఎస్సై వీరబాబు ప్రత్యేక బృందాలతో బాలిక కోసం గాలించారు. ఆ బాలిక ముందుగా విజయవాడ వెళ్లి, అక్కడి నుంచి సామర్లకోట వచ్చి, చివరకు రామచంద్రపురంలో ఉన్నట్టు గుర్తించారు. అక్కడి నుంచి ఇంద్రపాలెం తీసుకువచ్చి విచారించగా తల్లి మందలించడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయినట్టు పావని చెప్పింది. దీంతో బాలిక, ఆమె తల్లికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి, అనంతరం అప్పగించారు. కాగా.. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

హుండీల దొంగ అరెస్టు

అనపర్తి : మండలంలోని పలు ఆలయాల్లో హుండీల దొంగతనాలకు పాల్పడిన ప్రగడ నాగశివను అరెస్టు చేసినట్టు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన శివ ఈ నెల 7న రాత్రి మండలంలోని ఆరు దేవాలయాల్లోని హుండీలలో నగదు అపహరించినట్టు తెలిపారు. కుతుకులూరులోని భక్తాంజనేయస్వామి, పల్లపు వీధి సాయిబాబా, అన్నంపేట విఘ్నేశ్వరీదేవి, పులగుర్తలోని గంగాలమ్మ, మెయిన్‌రోడ్డులోని ఆంజనేయస్వామి, పెదపర్తిలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయాల్లో హుండీలను ధ్వంసం చేసి, వాటిలో సుమారు రూ.5500ను అపహరించాడన్నారు. ఇప్పటి వరకూ అనపర్తి, మండపేటతో పాటు మరో 11 ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డాడని తెలిపారు. నిందితుడి నుంచి రూ.1800, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.